**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |

## సీఎం మాట్లాడుతుండగానే జనం బయటకు

ప్రతి సభలాగే ఇక్కడా సీఎం ప్రసంగం మొదలు కాక ముందు నుంచే జనం బయటకు వెళ్లిపోయారు. పోలీసులు వారించినా వినిపించుకోలేదు. బారికేడ్లు తోసుకుని వెళ్లిపోయారు. జగన్ ప్రసంగం సమయంలో సభలోని కొన్ని ఏరియాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.






బారికేడ్‌లో నుంచి అవతలకు దూరి వెళుతున్న మహిళలు - బారికేడ్‌పై నుంచి దూకుతూ.. - సభలోని జనం బారికేడ్‌ను తోసుకుని వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకుంటున్న పోలీసు - చివరకు బారికేడ్ తోసేసి వెళ్లిన జనం

# బటన్ నొక్కడమేనా..
# భరోసా ఏది జగన్?



సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే జనం వెళ్లడంతో సభలోని ఒక ప్రాంతం ఖాళీగా మారిందిలా..

- చేనేతలకు 500 యూనిట్ల ఉచిత కరెంటేదీ?
- గాలేరు నగరికి చెందిన రిజర్వాయర్ల పూర్తి ఎప్పుడు?
- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు ఏదీ?
- నగరి ప్రజలకు నిరాశ మిగిల్చిన సీఎం పర్యటన



జగనన్న విద్యా దీవెన చెక్కును పంపిణీ చేస్తున్న సీఎం జగన్

చిత్తూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటన నగరి నియోజకవర్గ ప్రజలకు నిరాశ మిగిల్చిందని చెప్పవచ్చు. నగరి ప్రజలకు ఒక్కటీ స్పష్టమైన హామీ ఇవ్వకుండానే జగన్ తన ప్రసంగాన్ని ముగించారు. గతంలో కుప్పం, చిత్తూరులో పర్యటించినప్పుడూ స్పష్టమైన హామీలు ఇవ్వని విషయం తెలిసిందే. ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేని పరిస్థితినీ చూస్తున్నాం. తాజాగా నగరిలో విద్యా దీవెన పథకానికి చెందిన డబ్బుల్ని బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయడానికి వచ్చిన జగన్, మరోసారి స్పష్టమైన హామీలు ఇవ్వకుండానే కార్యక్రమాన్ని ముగించారు. నగరి ప్రజల అవసరాలను వివరిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి రోజా తన సుదీర్ఘ ప్రసంగంలో వివరించారు. జగన్ వాటిపై నామమాత్రంగా స్పందించారు.

### అక్కడా ఇక్కడా 'ఇప్పుడే..' మాట

'ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి 226 ఉద్యోగుల కుటుంబాలకు రావాల్సిన రూ.21.37 కోట్ల బకాయిలను ఇదే జిల్లాకు చెందిన చంద్రబాబు ఇవ్వలేదు. నేను కోరిన వెంటనే జగనన్న ఆ బకాయిలను రైతులకు అందించారు'అని మంత్రి రోజా వేదిక మీద అన్నారు. దానికి జగన్ స్పందిస్తూ 'ఇప్పుడే ఉద్యోగులకు ఆ డబ్బులు చెల్లించి నగరికి వచ్చాను' అని అన్నారు. గత నెల 4వ తేదీన చిత్తూరులో జరిగిన సమావేశంలోనూ ఎస్వీ షుగర్స్ ఉద్యోగులకు సంబంధించి జగన్.. 'ఇప్పుడే ఆ డబ్బులు వారికి చెల్లించి వచ్చా'నని అనడం గమనార్హం. అక్కడా ఇక్కడా అదే మాట చెప్పారు మరి.

### గాలేరు నగరి అనుసంధాన ప్రాజెక్టులపై స్పష్టతేదీ?

'గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు అనుసంధానమయ్యే వేణుగోపాలసాగర్, వేపగుంట, అడవికొత్తూరు రిజర్వాయర్లను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నాను. ఇప్పటికే 75 శాతం రిజర్వాయర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల్ని పూర్తి చేస్తే ఈ ప్రాంత రైతులకు సాగునీరు, గ్రామాల్లో తాగునీరు అందుతుంది' అని మంత్రి రోజా కోరారు. దానికి జగన్ స్పందిస్తూ ఆయా ప్రాజెక్టు పనుల్ని వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తామన్నారే తప్ప.. ఎన్ని కోట్లతో ఏ ప్రణాళికలతో ఎప్పటిలోగా పూర్తి చేస్తామని స్పష్టంగా చెప్పలేదు.

### చేనేతల బాధలు పట్టని జగన్

'ఇక్కడి చేనేతల కోసం కరోనా సమయంలో నేను అడిగిన వెంటనే 20 లక్షల మీటర్ల స్కూల్ యూనిఫాంలను తయారు చేసేలా ఏర్పాటుచేశారు. ఇలాగే ప్రతి ఏడాదీ స్కూల్ యూనిఫాం ఆర్డర్లను ఇప్పించాలని కోరుతున్నాను. చేనేతలకు కరెంటును తగ్గించి ఇవ్వాలని కోరుతున్నాను' అని రోజా వేదికపై సీఎంను అడిగారు. చేనేతలకు స్కూల్ యూనిఫాం ఆర్డర్ల గురించి జగన్ స్పందించలేదు. చేనేతలకు కరెంటు ఛార్జీల్లో ఎలక్ట్రిసిటీ డ్యూటీ మాత్రం లేకుండా చేస్తానని హామీనిచ్చారు. కానీ, తమిళనాడులో అక్కడి ప్రభుత్వం చేనేతలకు ఇస్తున్నట్లు 500 యూనిట్ల ఉచిత కరెంటును ఇవ్వాలని ఇక్కడివారు కోరుతున్నారు. ఉచిత కరెంటు టాపిక్‌ను తెలివిగా జగన్, రోజా పక్కన పెట్టేశారు. ఈ అంశంపై రోజా గతంలో జగన్‌ను కలిసి విన్నవించినా, సోమవారం మాత్రం అడగలేదు.

### ఉపాధి అవకాశాల మాటేంటి?

'కోసలనగరంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటుచేసి త్వరగా ప్రాజెక్టులను తెచ్చి ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి' అని రోజా కోరారు. వాస్తవానికి విజయపురం మండలంలోని కోసలనగరంలో ఇప్పటికే ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల ఎకరాలు సేకరించారు. దీన్ని అభివృద్ధి చేస్తే, చెన్నైకి దగ్గరగా ఉన్న కారణంగా అనేకరకాల పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ, జగన్ ఆ విషయాన్ని పట్టించుకోలేదు.



బురద తొక్కుకుంటూ.. ఇబ్బంది పడుతూ సభా ప్రాంగణంలోకి వెళుతున్న జనం

### అవీ.. ఇవీ

- తొలుత ప్రసంగించిన కలెక్టర్ షన్మోహన్.. వేదిక మీదున్న వారి పేర్లు చదివి స్వాగతం పలికారు. వరుసగా సీఎం జగన్, మంత్రులు పెద్దిరెడ్డి, ఉష శ్రీచరణ్ పేర్లు చదివిన తర్వాత డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేరు చదివారు. ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి తర్వాత డిప్యూటీ సీఎం పేరు చదవాల్సి ఉంది.
- సుదీర్ఘంగా సాగిన మంత్రి రోజా ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. ఆ తర్వాత ప్రారంభమైన సీఎం జగన్ ప్రసంగం తేలిపోయింది.
- రోజా 26 నిమిషాల పాటు ప్రసంగించడంతో వేదిక మీద కొందరు ప్రజాప్రతినిధులు విసుగ్గా కనిపించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగం ముగిసిందనుకుని మధ్యలో చేతులు పైకెత్తి చప్పట్లు కొట్టారు.
- రోజా వేదిక మీద మాట్లాడుతున్న సమయంలో అర్జీ ఇచ్చేందుకు ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి జగన్ వద్దకు వెళితే, ఆమెను చేయి పట్టుకుని పక్కన కూర్చొబెట్టి మరీ జగన్ మాట్లాడారు.
- డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ వేదిక మీద జగన్‌కు రాఖీ కట్టి, పాదాభివందనం చేశారు. తర్వాత రోజా కూడా రాఖీ కట్టారు.
- మంత్రి రోజా భర్త ఆర్‌కే సెల్వమణి.. సీఎం జగన్ వేదిక మీదకు వచ్చే చాలాసేపటికి ముందు వచ్చేశారు. వేదిక మీద రెండో వరుసలో కూర్చున్నారు.



## 90శాతం పూర్తయిన పనికి శంకుస్థాపన

నగరి పర్యటనలో సీఎం జగన్ మూడు పనులకు శంకుస్థాపన ఫలకాలను ఆవిష్కరించారు. వీటిలో వంద పడకల ఆస్పత్రి భవనం కూడా ఉంది. అయితే, నగరి పరిధిలో రూ.540 కోట్లతో చేపట్టే ఈ ఆస్పత్రికి సంబంధించి ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. దీనికి ఇప్పుడు శంకుస్థాపన చేయడంపై సభాస్థలి వద్ద చర్చనీయాంశంగా మారింది.

ఇక, పుత్తూరు సమీపంలోని నందిమంగళం వద్ద రూ.7.25 కోట్లతో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల భవనానికి, రూ.1.89 కోట్లతో నగరి పోలీసు స్టేషన్‌కు శాశ్వత భవనానికి శంకుస్థాపన ఫలకాలను సీఎం ఆవిష్కరించారు.

## సీఎం చేతులు కలిపినా..

- స్పందించని మంత్రి రోజా, కేజే శాంతి



ఆంధ్రజ్యోతి, చిత్తూరు/నగరి: సీఎం జగన్ నగరి పర్యటన కూడా వైసీపీలోని వర్గపోరును రూపుమాపలేకపోయింది. వేదిక పక్కన శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న జగన్.. తొలుత ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతితో మాట్లాడి, కలిసి పనిచేయండి అన్నట్టుగా మంత్రి రోజా వైపు చూపించారు. అయితే వారిద్దరూ ముఖాలు కూడా చూసుకోలేదు. సీఎం స్వయంగా వారి చేతులను పట్టుకుని కలిపే ప్రయత్నం చేశారు. కేజే శాంతి తన చేతిని ముందుకు చాచేందుకు ఇష్టపడలేదు. రోజా కూడా అనాసక్తంగా ఉండిపోయారు. జగన్ గట్టిగా లాగి ఇద్దరి చేతుల్నీ బలవంతంగా కలిపారు. అయితే రెప్పపాటు కాలంలోనే ఇద్దరూ తమ చేతుల్ని వెనక్కి లాగేసుకున్నారు. ఆ సమయంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, ఉష శ్రీచరణ్, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ అక్కడే ఉన్నారు. నగరి నియోజకవర్గంలో రోజా వ్యతిరేక వర్గం ఎంత గట్టిగా ఉందో ఈ సంఘటన అద్దం పట్టింది.

**కలిసి పనిచేసుకోండి :** నగరిలో విద్యాదీవెన బటన్ నొక్కే కార్యక్రమం పూర్తయ్యాక, సీఎం జగన్ స్థానిక డిగ్రీ కళాశాల వద్ద సుమారు 45 నిమిషాల పాటు జిల్లా నాయకులతో మాట్లాడారు. అక్కడ రోజాకు నగరిలో వ్యతిరేకంగా ఉన్న కేజే కుమార్, కేజే శాంతి దంపతులతో జగన్ ప్రత్యేకంగా మాట్లాడారు. అందరూ పరస్పరం కలిసి పనిచేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

# టీడీపీ నేతల ఇసుక సత్యాగ్రహం

- బీఎన్‌ఆర్‌పేట రీచ్‌లో అక్రమ రవాణా సాగుతోందంటూ ఆందోళన



ఇసుక రీచ్‌లో టీడీపీ నాయకులు చేపట్టిన ఇసుక సత్యాగ్రహం



కాలం చెల్లిన బిల్లును చూపుతున్న దొరబాబు

చిత్తూరు రూరల్, ఆగస్టు 28: తెలుగుదేశం పార్టీ నేతలు సోమవారం ఇసుక సత్యాగ్రహం చేపట్టారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట ఇసుక రీచ్‌ను సందర్శించారు. పూర్తిగా కనుమరుగైన నీవానదిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే పిడికెడు ఇసుకను కూడా మిగల్చకుండా వైసీపీ ప్రభుత్వం అక్రమ రవాణా చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఇసుకను ఉచితంగా అందిస్తానని చెప్పి జగన్.. ఇప్పుడేమో అక్రమంగా రవాణా చేయిస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక తరలించవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా వినిపించుకోవడం లేదన్నారు. అలాగే పాలూరు వద్ద గుట్టలా ఇసుక డంప్ చేసి అక్రమంగా రవాణా చేస్తుంటే అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎప్పుడో కాలం చెల్లిన జయప్రకాష్ ఎంటర్‌ప్రైజస్ కంపెనీ వారు దొంగ పర్మిట్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారంటూ టిప్పర్‌ను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీనిపై మంగళవారం తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఇసుక అక్రమ రవాణాపై రోడ్డుపైకొచ్చి పోరాడకుంటే, ఇసుక కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు నియోజకవర్గం రైతు అధ్యక్షుడు దేవరాజులు నాయుడు, మండల అధ్యక్షుడు శశికర్‌బాబు, నాయకులు మేషాక్, శోభన్‌బాబు, గురేష్, బాలకృష్ణ నాయుడు, రాజా, కుమార్, కంద, చల్లా తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కేసుల్లో చల్లాకు
# హైకోర్టు ముందస్తు బెయిల్

- మరో మూడింటిలో తిరస్కరణ

పుంగనూరు, ఆగస్టు 28: పుంగనూరు ఘటనలో నమోదైన ఏడు కేసుల్లో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి సోమవారం హైకోర్టు నాలుగుకేసుల్లో ముందస్తు బెయిల్ ఇచ్చింది. మరో మూడుకేసుల్లో బెయిల్ తిరస్కరించింది. గత 24 రోజులుగా అజ్ఞాతంలో ఉంటున్న చల్లా.. పోలీసులు రాజకీయ జోక్యంతో తనపై కేసులు పెట్టారని, తనకు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో న్యాయవాదుల ద్వారా పిటీషన్ దాఖలు చేశారు. చల్లాకు ఇంకా మూడు కేసుల్లో బెయిల్ రాకపోవడంతో ఆయన అజ్ఞాతం నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రిమాండులో ఉన్నవారు, కేసుల్లోని వారి కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో నేతలు బెయిళ్ల మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. రిమాండులోని వారి కోసం బెయిళ్లు మంజూరుకు న్యాయవాదులు పిటిషన్లు వేశారు. అలాగే, లాగే పుంగనూరు ఘటనకు సంబంధించి ఏడుకేసుల్లో పోలీసులు అరెస్టుచేసి చిత్తూరు,కడపజైళ్లలో రిమాండ్‌లో ఉన్న 98మంది, కురబలకోట మండలం అంగళ్లుఘటన కేసుల్లో అరెస్టు అయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 11మంది టీడీపీ వర్గీయుల బెయిల్ పిటీషన్లును మదనపల్లె ఏడీజే అబ్రహాం తిరస్కరించారు.

## ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, ఆగస్టు 28: ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో డీజిల్ మెకానిక్ 36, మోటర్ మెకానిక్ 3, ఎలక్ట్రీషియన్ 3, వెల్డర్ 2, పెయింటర్ 1, ఫిట్టర్ 1 మొత్తం 46 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 8వ తేదిలోపు ఆన్‌లైన్‌లో apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తర్వాత నకలు కాపీలు, సర్టిఫికెట్లు జిరాక్సులను సెప్టెంబరు 11వ తేదిలోగా డీపీటీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 99498 19912, 91542 91408 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పంట పొలాలపై ఏనుగుల దాడి



వరిపంటను తొక్కేసిన ఏనుగులు

బంగారుపాళ్యం, ఆగస్టు 28: బంగారుపాళ్యం మండలం వెలుతురుచేను పంచాయతీలో పంటపొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. పులిమడుగుకు చెందిన రైతు రమేశ్ పొలంలో వరి, అరటి చెట్లను.. కొత్తఇండ్లులోని పెద్దపాపకు చెందిన చెరకు తోటను తొక్కి.. నాశనం చేశాయి. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఫారెస్టు బీట్ ఆఫీసర్ డిల్లీరాణి.. నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

**DBS డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్.**

# 460/2, పిటికె కాంప్లెక్స్, 8వ బి మెయిన్ రోడ్, జైన్ టెంపుల్ ప్రక్కన, 4వ బ్లాక్, జయనగర్, బెంగళూరు-560011

అనుబంధం-IV-A (రూల్-8(6)ను నిబంధనను చూడగలరు)
స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్స్ 8(6) తో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

**రుణగ్రహీతలు** : మెసర్స్ వినాయక కార్స్ ప్రైవేట్ లిమిటెడ్, #219/11, ప్యాలెస్ ఆర్చర్డ్స్, సదాశివనగర్, బళ్లారి రోడ్, రమణ మహర్షి రోడ్, బెంగళూరు,-560080. మరియు #14, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, లాంగ్‌ఫోర్డ్ రోడ్, రిచ్‌మండ్ రోడ్, లాంగ్‌ఫోర్డ్ గార్డెన్స్ ఎదురుగా బెంగళూరు-560025. ప్రాతినిధ్యం వహించు శ్రీ ఎ సురేష్ కుమార్ బఫ్నా, (డైరెక్టర్ / హామీదారు) తండ్రి శ్రీ అస్కరన్ బఫ్నా #A-104, మంత్రి గ్రీన్స్, #1, సంపంగి రోడ్ మంత్రి మాల్ దగ్గర, మల్లేశ్వరం, బెంగళూరు-560003, మరియు #C1605 మంత్రి గ్రీన్స్, #1, సంపంగి రోడ్ మంత్రి మాల్ దగ్గర, మల్లేశ్వరం, బెంగళూరు-560003, శ్రీ ఎన్.జయకుమార్ (డైరెక్టర్/హామీదారు), తండ్రి శ్రీ నెమిచంద్ జైన్, #156 ట్రంక్ రోడ్, పూనమల్లె, తిరువల్లూరు జిల్లా, చెన్నై 600056, తమిళనాడు. శ్రీమతి రాజకుమారి జె, (డైరెక్టర్/హామిదారు), భర్త శ్రీ జయకుమార్ #156 ట్రంక్ రోడ్, పూనమల్లె, తిరువల్లూరు జిల్లా, చెన్నై 600056, తమిళనాడు, శ్రీ మహవీర్ చంద్ బఫ్నా(డైరెక్టర్/హామీదారు), తండ్రి శ్రీ అస్కరన్ బఫ్నా #46 వినోబాజి వీధి, మన్నార్ గుడి-614001 తిరువారూర్ జిల్లా, తమిళనాడు మరియు 158/7 సైడెన్‌హామ్స్ రోడ్, పెరియమెట్, చెన్నై-600003 మరియు శ్రీమతి నారాయణి ప్రతాప్(డైరెక్టర్/హామిదారు), భర్త శ్రీ ఎ.ప్రతాప్ బఫ్నా #1 బిగ్‌బజార్ వీధి, 156, మన్నార్ గుడి 614001 తిరువారూర్ జిల్లా, తమిళనాడు నుండి సెక్యూర్డు క్రెడిటర్‌కు **డిబిఎస్ బ్యాంక్ లిమిటెడ్, సిటీ మార్కెట్ శాఖ బెంగళూరుకు** చార్జ్ చేయబడినట్టి 26 జనవరి 2023 నుండి వడ్డీతో 25 జనవరి 2023 నాటికి **రూ.11,84,68,899.17 (రూపాయలు పదకొండు కోట్ల ఎనభై నాలుగు లక్షల అరవై ఎనిమది వేల ఎనిమిది వందల తొంబై తొమ్మిది మరియు పదిహేడు పైసలు మాత్రమే)** రాబట్టుకొనుటకు డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్, సెక్యూర్డు క్రెడిటర్‌కు తనాఖా/ఛార్జ్ చేయబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తులను అధికృత అధికారి లాంఛనప్రాయ స్వాధీనం చేసుకున్నారు, సెక్యూర్డ్ ఆస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "ఏది అక్కడ ఉంటే అది"** ప్రాతిపదికన విక్రయించబడుతుందని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు రుణగ్రహీత (లు) / హామిదారు (లు)కు తెలియజేయడమైనది.

| | |
|---|---|
| ఇ వేలం తేది | 05 అక్టోబర్ 2023న మ.12.00 నుండి మ.1.00 |
| బయానా కొరకు ప్రదేశం, చివరి తేది మరియు సమయం | 04 అక్టోబర్ 2023, మ.3.00 లోపల, డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్, ఎస్ఎఎమ్-బెంగళూరు, #460/2, పిటికె కాంప్లెక్స్, 8వ బి మెయిన్, జయనగర్ 4వ బ్లాక్, బెంగళూరు-560011. ఫోన్: 8106566658/7387072130 |
| రిజర్వ్ ధర | రూ.6,74,20,000.00 (రూపాయలు ఆరు కోట్ల డెబ్భై నాలుగు లక్షల ఇరవై వేలు మాత్రమే) |
| బయానా | రూ.67,42,000.00 ( రూపాయలు అరవై ఏడు లక్షల నలభై రెండు వేలు మాత్రమే) డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్ పేరున డిడి/పిఒ/బిసి/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్<br>ఖాతా నం: 164LIABIEFTCLINR,<br>ఐఎఫ్ఎస్‌సి: DBSSOIN0164 సిటీ మార్కెట్ శాఖ బెంగళూరు |

**స్థిరాస్తి వివరణ:** శ్రీ ఎన్ జయకుమార్, తండ్రి శ్రీ ఎన్ నెమ్మిచంద్ పేరున గల పిచ్చటూరు జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ మరియు శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లాలో గల 3ఎకరాల 47 సెంట్లు (మొత్తం ఎకరాలు 8.70సెంట్లు) విస్తీర్ణంతో మెట్ట సర్వే నం.165/2బి4 మరియు 3 ఎకరాల 21 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నం.165/2బి2, 4 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నం.165/2బి1, 1 ఎకర 98 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నం.114/1బి లో గల మహరాజాపురం గ్రామం, విజయపుర మండలం నం.47, చిత్తూరు జిల్లా వద్ద గల భూమి ఆస్తి యావత్తు.

**4 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నం 165/2బి1, 1 ఎకర 22 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నం.114/1బి సరిహద్దులు:** తూర్పు: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి, పశ్చిమం: మహరాజపురం రోడ్, ఉత్తరం: శ్రీ వీర రాఘవులకు చెందిన భూమి దక్షిణం: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి,

**2 ఎకరాల 00 సెంట్ల పూర్తి విస్తీర్ణంతో మెట్ట సర్వే నంబర్: 165/2బి2 సరిహద్దులు:** తూర్పు: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి, పశ్చిమం: మహరాజపురం రోడ్ మరియు శ్రీమతి వి రాజేశ్వరి భూమి, ఉత్తరం: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి, దక్షిణం: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి, మరియు శ్రీమతి వి రాజేశ్వరికు చెందిన భూమి,

**76 సెంట్ల విస్తీర్ణంతో సర్వే నంబర్: 114/1బి మరియు 1 ఎకరా 21 సెంట్ల విస్తీర్ణంతో మెట్ట సర్వే నంబర్ 165/2బి2 సరిహద్దులు:** తూర్పు: చెరువు డ్రైనేజ్ కాలువ పొరంబోకు, పశ్చిమం: మహరాజపురం రోడ్ ఉత్తరం: శ్రీ వీర రాఘవులకు చెందిన అన్ని రకాల భూమి, దక్షిణం: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి,

**3 ఎకరాల 47 సెంట్ల పూర్తి విస్తీర్ణంతో మెట్ట సర్వే నంబర్ 165/2బి4 సరిహద్దులు:** తూర్పు: చెరువు డ్రైనేజ్ కాలువ పొరంబోకు, పశ్చిమం: శ్రీమతి వి రాజేశ్వరికి చెందిన భూమి, ఉత్తరం: రేణుక టెక్స్‌టైల్స్ ప్రాసెసర్స్ లిమిటెడ్‌కు చెందిన భూమి, దక్షిణం: తిరుత్తని చెన్నై ట్రంక్ రోడ్ మరియు విక్రేతకు చెందిన భూమి, మరింత సవివర నియమ నిబంధనల కొరకు ఇ వేలం సర్వీసు ప్రొవైడర్ వెబ్‌సైట్ https://bankauctions.in దర్శించగలరు.

తేది: 28 ఆగస్టు 2023
ప్రదేశం: బెంగళూరు

అధీకృత అధికారి మరియు చీఫ్ మేనేజర్
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్

